శభాష్.. ట్రాఫిక్‌ను క్లియర్ చేశాడు



ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తూ...

జగద్గిరిగుట్ట: షాపూర్ నగర్ నుంచి కూకట్‌పల్లి, గాజుల రామారం నుంచి షాపూర్ నగర్ వెళ్లే దారిలో మంగళవారం ఉదయం 9 గంటలకు తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడింది. ట్రాఫిక్ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడే అటువైపు ఓ వ్యక్తి వచ్చి సుమారు అర గంట పాటు ట్రాఫిక్ విధులు నిర్వర్తించి.. ట్రాఫిక్‌ను క్లియర్ చేశాడు. అందరు శభాష్ అంటూ మెచ్చుకుంటూ ముందుకు వెళ్లారు. ఇప్పటికైనా ఈ పైప్‌లైన్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

హక్కుల కోసం పోరాడేది ఎర్రజెండానే..

కుత్బుల్లాపూర్: పేదలు, కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఎర్రజెండానే అని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. మండల శాఖ మహాసభల సందర్భంగా షాపూర్ నగర్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సీనియర్ నాయకుడు వెంకన్న అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1 నుంచి దేశ వ్యాప్తంగా పార్టీ శాఖ మహాసభలు జరుగనున్నాయని, ఇందులో భాగంగానే కుత్బుల్లాపూర్ మండల పరిధిలో ఉన్న శాఖ మహాసభలు నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలను విజయవంతంగా నిర్వహించేందుకు సంజయ్ గాంధీనగర్ శాఖ కార్యదర్శిగా పసుల అంజయ్య, షాపూర్ నగర్ శాఖ కార్యదర్శిగా స్వాతి, అసంఘటిత రంగ శాఖ కార్యదర్శులుగా దేవదానం కరుణాకర్, గాజులరామారం శాఖ కార్యదర్శిగా జాకీర్ హుస్సేన్, చింతల్ శాఖ కార్యదర్శిగా సత్యంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడం తగదని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మైసయ్య, రామారావు, సంజీవరాజు, నాగమణి, జమున, కృష్ణ, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దు



పచ్చదనం-పరిశుభ్రతలో పాల్గొన్న జీహెచ్ఎంసీ సిబ్బంది

చింతల్: రోడ్ల పైన ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దని జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది మంగళవారం చింతల్ సబ్‌స్టేషన్ వద్ద పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 'నేను చెత్త వేయను.. ఇతరులను చెత్త వేయనివ్వను' అని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, పూర్ణచంద్రరావు, నాగభూషణం, నారాయణరెడ్డి, మున్సిపల్ జవాన్ చందర్, సూపర్‌వైజర్లు వెంకటేష్, రామకృష్ణ, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ సీజీఎం సాయిబాబా

కుత్బుల్లాపూర్: పారిశ్రామిక ప్రాంతాల్లో నిరంతర విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ డివిజన్ విద్యుత్‌శాఖ సీజీఎం సాయిబాబా అన్నారు. మంగళవారం దూలపల్లి ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యలు- పరిష్కారం సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను తెలుసుకున్న సీజీఎం లైన్లను ఆధునీకరించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రవికుమార్, డీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఏడీఈ సత్యనారాయణ, ఏఈ వినాయకరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



నీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఉప కమిషనర్ మల్లారెడ్డి, బాలానగర్ ఏసీపీ శ్రీనివాసులు

సుభాష్‌నగర్: సూరారం ప్రధాన రోడ్డు నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మంగళవారం గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి, బాలానగర్ ఏసీపీ శ్రీనివాసులు, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద ప్రధాన రోడ్డును పరిశీలించారు. స్థానికంగా పైపు సామర్థ్యం చిన్నగా ఉండి చిన్నపాటి వర్షానికి 150 మీటర్ల పొడవు వరకు రోడ్డుపై మోకాలు లోతు నీరు నిల్వ ఉంటుంది. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడంపై ఉప కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన రోడ్డుపై కొన్ని దుకాణాలు ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. త్వరలో వరదనీరు నిల్వకుండా ప్రధాన రోడ్డు పక్కన పైపులైన్ సామర్థ్యం పెంచి, వర్షం నీరు సులువుగా వెళ్లేందుకు చర్యలు చేపడతామని ఉప కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాండ్ సమీపంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. కొన్ని రోజులుగా ఇక్కడ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక వ్యాపార సముదాయ యజమానులు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆదిలోనే అడ్డుకట్ట దిశగా..

- మేడ్చల్ జిల్లాలో కొనసాగుతున్న ఎన్‌సీడీ సర్వే
- 30 ఏళ్లు దాటిన వారిపై ప్రత్యేక శ్రద్ధ.. నిర్ధారణ పరీక్షలు
- బీపీతో 1.15 లక్షలు, షుగర్ బాధితులు 72 వేల మంది గుర్తింపు
- ఆహార నియమాలు పాటించేలా జిల్లా వైద్యారోగ్య శాఖ అవగాహన కార్యక్రమాలు



సాక్షి,సిటీబ్యూరో: ఉరుకులు, పరుగుల జీవితంలో ఆహారపు అలవాట్లు మారాయి. దీనికితోడూ సాంకేతికత పెరిగి శారీరక శ్రమ తగ్గడంతో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, కేన్సర్లు ఇలా రకరకాల దీర్ఘకాలిక వ్యాధులతో చాలామంది బాధపడుతున్నారు. పట్టణ జనాభా అధికంగా ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇదే ధోరణి ఎక్కువగా ఉంది. దీంతో వాటిని ఆదిలోనే కట్టడి చేసి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. 30 ఏళ్లు దాటిన వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేందుకు అసంక్రమిక వ్యాధుల నిర్ధారణ (ఎన్‌సీడీ)

ఆదిలోనే గుర్తించేలా..

మధుమేహం, రక్తపోటు, వివిధ రకాల కేన్సర్లను ఆదిలోనే గుర్తించి నివారించాలన్నా ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో మే నుంచి మూడో విడత సర్వే కార్యక్రమం కొనసాగుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 30 ఏళ్లు దాటిన వారు 17 లక్షల మంది లక్ష్యంగా సర్వేను నిర్దేశించారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు ఇంటింటికీ తిరుగుతూ పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 5,76,242 మందిని స్క్రీనింగ్ చేసి పరీక్షించగా 1.15 లక్షల మంది రక్తపోటు (బీపీ)తో 72 వేల మంది మధుమేహం (షుగర్) వ్యాధికి గురైనట్లు వైద్యాధికారులు గుర్తించారు. వారికి ప్రతి నెల ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మళ్లీ పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. అలాగే పలువురు వివిధ రకాల కేన్సర్లతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు.

కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ప్రస్తుతం జిల్లాలో మూడో విడత సర్వే కొనసాగుతోంది.

మారుతున్న ఆహారపు అలవాట్లు..

మారుతున్న ఆహారపు అలవాట్లు వ్యాధులకు దగ్గర చేస్తున్నాయి. చిన్న వయస్సులోనే జంక్ ఫుడ్, ఇతరత్రా వాటికి అలవాటు పడుతున్నారు. కళాశాల స్థాయికి చేరగానే ధూమపానం, మద్యపానంతో పాటు గంజాయికి బానిస అవుతున్నారు. దీంతో 30-40 ఏళ్ల వయస్సు వారి ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతోంది. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులపై ఎక్కువగా ఒత్తిడి ఉంటుండడంతో వారు కూడా మధుమేహం, రక్తపోటు వంటి బారినపడి జీవిత కాలం మాత్రలు మింగాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

ఆహార నియమాలు పాటించాలి..

ఆహార నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. నిత్యం కొంత సమయాన్ని వాకింగ్, యోగాకు కేటాయించాలి. తద్వారా ఒత్తిడిని నియంత్రించి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. సమతుల్య ఆహారం తీసుకోవాలి. మధుమేహంతో బాధపడుతున్న వారు నిల్వ ఆహారం తీసుకోకుండా చూడాలి. జిల్లాలో ఎన్‌సీడీ సర్వే కొనసాగుతోంది. వ్యాధులు నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్, కౌశిక్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నిజాంపేట్: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పలువురు అన్నారు. స్వచ్ఛతా హీసేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రగతినగర్ ఇన్‌కాయిస్‌లో హ్యూమన్ చైన్ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులంతా వరుసగా నిలబడి స్వచ్ఛ భారత్ నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛ భారత్ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఎస్.నాగేశ్వర రావు, దేవేంద్ర కుమార్, శాస్త్రవేత్తలు ఉదయ్ భాస్కర్, మురళీకృష్ణ, కిరణ్ కుమార్, వెంకట శేషు, వేణుగోపాలరావు, విజయ్, గిరిధర్, దాసరి ప్రసాద్, నిర్మల, స్నేహజ, ప్రజ్ఞ, మయూక, తారుణ్య తదితరులు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌కాయిస్ ఉద్యోగులు

ప్రజా సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

కుత్బుల్లాపూర్: ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు పాత్తూరి మాధురి శివాజీ రాజు, సెన్సార్ బోర్డు సభ్యురాలు సరితారావు అన్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపల్ పరిధి 12వ వార్డు ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన ఉందని, రికార్డు స్థాయిలో సభ్యత్వాలను పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు పక్కనే ఇసుక డంప్‌లు

- వాహనాలు స్కిడ్ అవుతుండటంతో ప్రమాదాలు
- రోడ్డు పక్క స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు
- పట్టించుకోని అధికారులు

జీడిమెట్ల: జీడిమెట్లలోని నర్సాపూర్ హైవే పక్కన ఉన్న ఐలా గ్రీన్‌బెల్ట్‌లో స్థలాలను పలువురు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. చెట్ల మధ్యలో ఇసుక, ఇటుక, కంకర, ఎర్రమట్టి, డస్ట్‌లను డంప్ చేస్తున్నారు. ఇలాంటి వ్యాపారాలు గ్రీన్‌బెల్ట్‌లో నిర్వహించకుండా అడ్డుకోవాల్సిన ఐలా మున్సిపల్ అధికారులు తమకేమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మెటీరియల్‌ను డంప్ చేసే క్రమంలో అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉండటంపై పలు అనుమానాలకు తావిస్తోంది. వ్యాపారాల నడిచేందుకు ఐలాలో ఉన్న కొంతమంది కింది స్థాయి సిబ్బంది బిల్డింగ్ మెటీరియల్ వ్యాపారస్తుల నుంచి నెల నెల వసూళ్లకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని అయ్యప్ప కాలనీ స్ట్రీట్ నెంబర్- 2లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో హిందూ అనే మహిళ మృతి చెందింది. మంగళవారం అయ్యప్ప కమిటీ అసోసియేషన్ తరఫున బాధిత కుటుంబానికి రూ.9,600 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తమ వంతు ఆదుకుంటామని కాలనీ వాసులు బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు.

చెత్త వేయకుండా అధికారుల చర్యలు

ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో చెత్తను వేయకుండా అవగాహన కల్పించినా మార్పు మాత్రం అంతంత మాత్రమే. తాజాగా 24 గంటలు ఆ ప్రదేశంలో సిబ్బందిని షిఫ్ట్‌ల వారీగా నియమిస్తూ చెత్తను వేయకుండా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

– జగద్గిరిగుట్ట



జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సమీపంలో స్టాండ్ నిర్మాణం చేపడుతున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరిపై కేసు

కుత్బుల్లాపూర్: సామాజిక సేవా కార్యకర్తల ముసుగులో హోటళ్ల నిర్వాహకులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు మహిళలపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ విజయవర్ధన్ వివరాల ప్రకారం.. మలక్‌పేట్‌కు చెందిన బొగ్గుల సునీత(50), సికింద్రాబాద్ పద్మారావు నగర్‌కు చెందిన విజయలక్ష్మి(58) ఈ నెల 23వ తేదీన సుచిత్రలోని గిస్మత్ హోటల్‌కు వెళ్లారు. తాము ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సభ్యులమని పేర్కొంటూ వంట గదిలోకి వెళ్లారు. మీ హోటల్‌లో అపరిశుభ్రత నెలకొందని, హోటల్‌ను మూయిస్తామని, తమకు డబ్బులు ఇస్తే వదిలేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో హోటల్ నిర్వాహకులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సునీత, విజయలక్ష్మి గతంలోనూ ఇదే విధంగా పలు హోటళ్ల నిర్వాహకుల నుంచి వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. వారికి పోలీసులు నోటీసులను అందజేశారు.

పరామర్శ

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ సలీం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఆయనను పరామర్శించారు.



సలీంను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ అంబేడ్కర్ నగర్, చంద్రగిరి నగర్ బస్తీల్లో ఇటీవల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్ వేశారు. దీంతో ప్రధాన రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు కూన శ్రీశైలంగౌడ్‌కు వివరించారు. ఆయన జిల్లా మంత్రి డి.శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నూతన రోడ్డు నిర్మాణానికి రూ.74 లక్షలు మంజూరు చేయడంతో స్థానికులు మంగళవారం శ్రీశైలంగౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, బస్తీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బస్తీల్లో మంజీరా నీరు సరిగ్గా రావడం లేదని, ఫాగింగ్ చేయడం లేదని, స్ట్రీట్ లైట్స్ వెలగడం లేదని కాలనీ ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సతీష్, నవీన్, సంతోష్ యాదవ్, సంతోష్ గుప్తా, అమర్ నాథ్, శివరాజ్, శివ, వెంకటేష్, నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి, బుచ్చిరెడ్డి, రషీద్ బేగ్, లాల్ మహ్మద్, సుఖ్‌దేవ్ పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పాటు



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించి మెరుగైన వసతులు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో సీసీ రోడ్డు దెబ్బతినడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంత్రి రూ.28 లక్షల స్పెషల్ ఫండ్స్‌ను మంజూరు చేశారు. పూర్తైన పనులను మంగళవారం హన్మంతరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో పండరి రావు, బాల్‌రెడ్డి, నాగరాజు, సిద్దనోళ్ల సంజీవ్‌రెడ్డి, శివ, అంజలియాదవ్, రజిని తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు లయన్ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం గణేష్ నగర్‌లోని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఉచిత డెంటల్ క్యాంప్ నిర్వహించారు. స్థానిక మహిళలు, ఫాదర్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థులు పాల్గొని దంత పరీక్షలు చేయించుకున్నారు. దంతాల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో లయన్ జీఆర్ సుజాత, సుష్మిత, వెంకట్, రాజేశ్వర్, వైద్యులు ప్రఫుల్ల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

15 రోజులుగా కారు పార్కింగ్

- వదిలి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు!



సుచిత్రలోని సెయింట్ ఆంథోనీస్ స్కూల్ సమీపంలో పార్కు చేసిన కారు

కుత్బుల్లాపూర్: ప్రధాన రోడ్ల వెంబడి రోజుల తరబడి వాహనాలను ఇష్టానుసారంగా పార్కు చేస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వివరాల్లోకి వెళితే.. సుచిత్ర సర్కిల్‌లోని సెయింట్ ఆంథోనీస్ స్కూల్ సమీపంలోని పార్కును ఆనుకుని పదిహేను రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు కారును పార్కు చేసి వదిలేశారు. దీంతో చుట్టు పక్కల ప్రాంత వాసులు ఈ విషయమై ఆరా తీసినా కారు ఎవరిదో తెలియడం లేదు. కారు విషయంలో అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు జలమయం

నిజాంపేట్: మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి నిజాంపేట్ కార్పొరేషన్ ఆదిత్యగార్డెన్‌లోని పలు వీధులు జలమయమయ్యాయి. మోకాలలోతు మేర వరదనీరు చేరడంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ప్రతి వర్షాకాలం తాము తిప్పలు పడుతున్నామని, దీనిపై స్పందించి అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదిత్యగార్డెన్ వాసులు కోరుతున్నారు.



ఆదిత్యగార్డెన్ రోడ్డులో చేరిన వరదనీరు

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్
- ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్ అన్నారు. పేట్ బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్కిళ్ల పరిధిలో రూ.93 కోట్ల నిధులతో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న పనులతో పాటు రూ.46 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు రూపొందించిన ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని పరిష్కరించడంలో భాగంగా నియోజకవర్గంలో చేపడుతున్న లింక్ రోడ్ల నిర్మాణ పనుల్లో భాగంగా భూదేవి హిల్స్ నుంచి లెనిన్ నగర్, సూరారం జంక్షన్ నుంచి మెట్కానీగూడ మీద ఉషా ముల్లపూడి చౌరస్తా వరకు, స్కందానగర్ నుంచి రాజీవ్‌గాంధీ నగర్ వరకు, ఫాక్స్ సాగర్ రోడ్డు, హెచ్ఆర్డీసీఎల్‌తో సమన్వయం చేసుకుంటూ లింక్ రోడ్డు పనులను చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అదేవిధంగా చెరువుల సుందరీకరణలో భాగంగా పెద్ద చెరువు, పరికిచెరువు, ఫాక్స్ సాగర్, వెన్నెలగడ్డ చెరువులను అభివృద్ధి చేసి పిక్నిక్ స్పాట్ లాగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. వైకుంఠ ధామాల అభివృద్ధిలో భాగంగా కళావతి నగర్, భగత్ సింగ్ నగర్, పద్మానగర్ ఫేజ్ -2, అంబేడ్కర్ నగర్, దేవేందర్ నగర్, చంద్రగిరి నగర్ ముస్లిం గ్రేవ్ యార్డ్, అయోధ్య నగర్ వైకుంఠధామాలను మోడ్రన్ గ్రేవ్ యార్డులుగా తీర్చిదిద్దాలన్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా నాలాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు.

అందుబాటులోకి క్రీడా మైదానాలు..

క్రీడాభివృద్ధిలో భాగంగా గాజులరామారం, ఎస్.ఆర్.నాయక్ నగర్, గోదావరి హోమ్స్ (బ్యాడ్మింటన్ కోర్ట్) గాయత్రి నగర్, ఆర్.కె. లేఅవుట్, మిథిలా నగర్‌లలో (బాస్కెట్ బాల్, వాలీబాల్) మైదానాలను నిర్మించడంతోపాటు వీలైనన్ని క్రీడా మైదానాలలో వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గంలోని పార్కుల సుందరీకరణతో ఆహ్లాదకర వాతావరణంతో ప్రజల జీవన ప్రమాణాలను పెంచే విధంగా కృషి చేయాలన్నారు. అదేవిధంగా బాలానగర్-నర్సాపూర్ ప్రధాన రహదారిలోని షాపూర్ నగర్ చౌరస్తా, సూరారం చౌరస్తా, కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం చౌరస్తా, గాజుల రామారం చౌరస్తా, జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ చౌరస్తాలను అభివృద్ధి చేయాలన్నారు.

బతుకమ్మ ఘాట్‌ల నిర్మాణం

మహిళలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించే బతుకమ్మ పండుగలో భాగంగా బతుకమ్మ ఘాట్ ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. ఇలాంటి బతుకమ్మ ఘాట్లను నియోజకవర్గంలో వీలైనన్ని చోట్ల నిర్మించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

రహదారుల అభివృద్ధికి...

జలమండలి శాఖ పూర్తి చేసిన డ్రైనేజీ, తాగునీటి నరఫరా పైపులైన్ రోడ్లను గమనించి మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని ముఖ్యదారులైన జగద్గిరిగుట్ట -షాపూర్ నగర్ పైప్‌లైన్ రోడ్డు 80 ఫీట్లకు విస్తరణతో పాటు రోడ్డులో 30 ఫీట్ల కల్వర్టు నిర్మాణానికై ప్రణాళికలు రూపొందించాలని, సుభాష్ నగర్ పైప్‌లైన్ రోడ్డు, కుత్బుల్లాపూర్ గ్రామం రోడ్డు త్వరగా చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఇంజినీరింగ్ శాఖ ఈఈలు లక్ష్మీగణేష్, కిష్టప్ప, డీఈ రూపాదేవి, పాపమ్మ, శిరీష, ఏఈలు మల్లారెడ్డి, కల్యాణ్, తిరుపతి, స్వాతి, రవీందర్ పాల్గొన్నారు.